అప్పుడామెకు కనిపించినవి – బంగారు పాములా కెంపు కళ్ళ ఎర్రదనం–కరెన్సీ నోట్ల పచ్చదనం, పోలీసు బెల్టుల బకిల్సు మెరుపులూ–కోసిన కడుపులో కిరకిర తిరిగే రక్తపు పేగులు.

పిచ్చిగా ఆట ఆడింది నశీం.

ఆట అయ్యేసరికి ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగేయి. ఆట ఆఖరున ఆమె గెడ చివర నుంచి బాబా చేతుల్లోకి గెంతాలి. అలా కొన్ని వేలసార్లు గెంతింది.

కాని యిప్పుడు నీళ్ళు నిండిన కళ్ళకి చేతులు చాపిన ఇద్దరు నాన్నలు కనిపించేరు.

పకడో అని అరిచి గెంతేసింది. ఎనిమిదేళ్ళ నశీం.

కింద ఇద్దరు నాన్నల్లో ఒకడు దేవుడిచ్చిన నాన్న, రెండో వాడు మీరూ నేనూ యిచ్చిన నాన్న.

ఆమె ఏ తండ్రి చేతుల్లో పడుతుంది?

**(1971)**

# పాత కథే

"మనిషివంక మహాలక్ష్మి తీరుస్తుంది"

అవతార పురుషులకీ, మహాత్ములకీ కొన్ని నియమాలు, ప్రతిజ్ఞలూ వుంటాయి. శ్రీరాముడు ఎప్పుడూ తండ్రి మాట జవదాటలేదు. కర్ణుడు ఎప్పుడు అడిగిన వాడికి లేదన్లేదు.

అయితే ప్రతిజ్ఞలు, నియమాలూ కేవలం అవతార పురుషులకే వుంటాయనీ, మన్లాంటి మామూలు మనుష్యులకి వుండవనీ, వుండకూడదనీ అనుకోవడం శుద్ధ తెలివితక్కువ. అబ్సల్యూట్ ఇడియసీ.

మా అమ్మ వారానికి మూడు రాత్రులు భోం చెయ్యదు. మా చిన్ని ఎప్పుడూ హోంవరక్కు చెయ్యదు. వాళ్ళ మేష్టారెప్పుడు పాఠం చెప్పడు. మా ఎదురింటి ఇంజనీరు కూతురు పైటా, కాలూ రెండూ ఎప్పుడూ నిలవ్వు. యివన్నీ వారి వారి ప్రతిజ్ఞలే. అయితే యిందులో ఒక చిన్న గమ్మత్తుంది. మహాత్ములకైతే ప్రతిజ్ఞలంటారు. మామూలు వాళ్ళకైతే అలవాట్లంటారు.

మావూరి మేస్ట్రీటుగారు అవతార పురుషులు కారు. అలాగని పాపం ఆయనెప్పుడూ ఎరితోనూ అన్నట్టు కూడా ఎవరూ అన్లేదు. "ఐయామ్ జస్ట్ యాన్ ఆర్డినరీ మేన్ అంటారు" డబ్బు తీసుకోకుండా న్యూసెన్స్ కేసులో కూడా జడ్జిమెంటు చెప్పరు. ఇది వారి భీషణ ప్రతిజ్ఞ. ఆ ప్రతిజ్ఞ నిలబెట్టుకోవడంలో వారే హరిశ్చంద్రుడికీ తీసిపోరు. వారికీ, హరిశ్చంద్రుడికీ తేడా ఒక్కటే. హరిశ్చంద్రుడు తన ప్రతిజ్ఞ వల్ల తను నాశనం ఐపోయేడు. వీరు ప్రజని సర్వనాశనం చేస్తున్నారు. (అది వాళ్ళ ఖర్మ. తనేం చేస్తాడు? కోర్టుకి రండి బాబ్బాబు అని తనేవైనా బతిమాలేడా? కోర్టు కెక్కినవాడు, గాడిదెక్కినవాడూ ఒకటేనని వాళ్ళకి మాత్రం తెలియదూ).

బావున్నా, బాగులేకపోయినా, ప్రతి సినిమా ఫస్టుడే ఫస్టు షోకి వెళ్ళకపోతే నాకేవిటో పిచ్చెకుతుంది బాబు అంటుంది, రేసుగుర్రాల్లా ఎదిగున్న మేస్ట్రీటుగారి మొదటి ముగ్గురిలో మొదటిది. ఆ అమ్మాయి కింకా పిచ్చెక్క లేదు.

ఎన్నిసార్లు చెప్పినా విన్పించుకోదు మా డాడీ. ఒక కారు కొనమంటే. కారు లేకపోతే కాలు కిందపెట్టాలంటే నాకు మహ చెడ్డ చిరాకేస్తుంది సుమండీ. అంటుంది రెండోది.

వాళ్ళెప్పుడూ నడిచి గాని, రిక్షాలోగాని ఎక్కడికి వెళ్ళలేదు. అలాగని ఎప్పుడూ ఇంట్లోనూ ఉండరు.

కాకి పిల్లచేత కబురు పెడితే కారు తీసుకొచ్చి గుమ్మంలో పెడతాడు టు. టౌన్, ఎస్.ఐ. స్వంతకారుంటే వుండే కష్టాలు వీళ్ళకేం తెలుసు? వుమెన్ ఆర్ బార్న్ యిడియట్స్ అనుకుంటారు మేస్ట్రీటు గారు.

అలాగని వారికి పిల్లలంటే యిష్టం లేదనుకోవడం మహా పాపం. అయిదుగురూ ఆడపిల్లలే అయినా వారికి పిల్లలంటే తగని గర్వం. అంతులేని ఆపేక్ష.

"ఆడముండకి ఆల్ జీబ్రా ఎందుకండీ? అంట్లు తోవడం రావాలి గాని" అని ఆయన అభిప్రాయం. అంచేత తన పిల్లలెవర్నీ ఎస్.ఎస్.ఎల్.సి. దాటి చదివించలేదాయన. కాని మా రెండోదుంది చూసేరూ? ఏం తెలివండి? షి ఈజ్ ఎన్ అప్ ఎండ్ కమింగ్ రైటర్. ఈ మధ్య "మగవాళ్ళూ మొండితనం" "పిల్లల్ని కనకపోవడం కంటే పెంచడం" "ఇల్లు సర్దడంలో ఇరవై చిటకాలు" "ఆడవాళ్ళూ – అబద్దాలు" ఇంకా ఏవేవో చాలా ఆర్టికల్స్ పత్రికల్లో రాసింది. ఈ మధ్యే ఒక నవల, మూడు కథలు ప్రారంభించింది. ఏమ్మా! ఎప్పటికైనా సినీమాకి రాయాలని కదూ నీ యాంబిషన్? ఎంకరేజ్ చెయ్యాలండీ, మనం

మన పిల్లల్ని– పరాయివాళ్ళని కూడదని కాదు సుమండీ – ప్రోత్సహించాలి. వుయ్ మస్ట్ ఎంకరేజ్ దెమ్. అని అప్పుడప్పుడు ఆయన అంటూంటారు.

లేకపోతే "దిసీజ్ మై థర్డ్ చైల్డ్. ఎ బార్న్ డాన్సర్. ఏ పాటకైనా లయ తప్పకుండా డాన్సు చేస్తుంది. మంచి డాన్సు మేష్టారుని చూడాలి. ఇదే సిటీస్‌లో వుంటే మంచి అపర్చునిటీస్ వుంటాయ్. వెదమ్ముండకి శృంగారం అని ఈ వూరికి డాన్సు మేష్టారు కూడానా? దీన్ని పెద్ద డాన్సర్‌ని చెయ్యాలి. వెనకనుండి చూస్తే వైజయంతిమాల పోలికలు కన్పించడం లేదూ? అఫ్ కోర్సు ప్రొఫైల్ అంతా పద్మినే అనుకోండి. ఏది తల్లీ! ఒక్కసారి ఆ 'పిలువకురా' పాట పెట్టి డాన్సు చెయ్యి" అంటారు యింటికెవ రొచ్చినా.

చదువైతే చెప్పించలేదు గాని వారు తన పిల్లలకి (అందులోనూ తల్లి లేదు కూడాను) ఏ లోటు యింత వరకు రానివ్వలేదు. ఇటుపైని రానివ్వరు. అందరికీ ఎవరి ట్రాన్సిష్టరు వారికుంది. డాన్సు అమ్మాయికి డాన్సు ప్రాక్టీసుకి రికార్డు ప్లేయరుంది. పెద్దమ్మాయి తన కిష్టమైన సినిమా పాటలు మళ్ళీ విన డానికి టేప్ రికార్డరు (ఇండియన్‌ది కాదు) వుంది.

పెద్దమ్మాయికి పెళ్ళీడు దాటిపోయి, యింక కొన్నేళ్ళలో పిల్లల్నికనే వయసు కూడా దాటిపోతోంది. రెండోది పెళ్ళీడు దాటింది. మూడోది పెళ్ళీడుకి యిటోకాలు ఆటో కాలు వేసు క్కూర్చుంది. మిగిలిన యిద్దరూ యింకా లంగా స్టేజిలోనే వున్నారు.

మేజ్ట్రీటు గారు గొప్ప వేదాంతి.

ఎ గ్రేట్ పిలాసఫర్.

అంచేత పిల్లలకి పెళ్ళికాలేదన్న బెంగ వారికి ఏ కోశాన లేదు. పెళ్ళీ లేక, పెద్ద చదువూ లేక, రేపు వీళ్ళేమౌతారన్న విచారం పెద్దగా లేదు. ఈ విషయంలో వారు నిజంగా మహాత్ములే.

మనదేం వుందండీ. అంతా భగవదిచ్ఛ. ఎలా జరగాలని రాసుంటే అలా జరుగుతుంది. బెంగ పెట్టుకుంటే చిక్కి పోవడం తప్ప, చిక్కులు తీరవు. మనం నిమిత్త మాత్రులం. ఇది వారి ఓపెన్ ఫిలాసఫి.

పేరా? పరువా? ప్రతిష్ఠా?

మనిషిక్కావలసింది ఏఁవిఁటి? దేవుడంటే భక్తా? ప్రజ లంటే ప్రేమా? అధికార్లంటే భీతా? ఇవేవీ కావు. ఇవి వుండకూడదని నేనను సుమండీ!

మనిషొక్కావలసింది డబ్బు.

మనిషివంక మహాలక్ష్మి తీరుస్తుంది.

డబ్బు చూపిస్తే కొండమీది దేవుఁడు దిగివస్తాడు. కోర్టు నుండి న్యాయం పరిగెత్తుకొస్తుంది. కోటలో వట్టి పాగా కాదు పరువూ లేదూ, పరుపు వేసుకు పడుకోవచ్చు. పక్కలో రాణిని పెట్టుకోవచ్చు.

"డబ్బున్నవాడు ఖూనీ చేస్తే డిఫెన్సుకి పోలీసువాడే పునాది వేస్తాడు. శవం మీద దెబ్బలే లేవంటాడు శవం డాక్టరు"

"డబ్బుగల వాడి భుజానికి బలం ఎక్కువ"

"వాడి మాటకి విలువ కూడా ఎక్కువే"

"వాడి అబద్ధం నిజం, వాడి పాపం పుణ్యం, వాడు డబ్బు పెట్టకపోవడం పొదుపు, నువ్వు ఖర్చు పెట్టకపోవడం కక్కుర్తి. వాడు కారులో వెళ్ళకపోతే సింప్లిసిటీ, నువ్వు వెళ్తే తలపొగరు. వాడు ముండని వుంచుకుంటే రసికత్వం. నువ్వు వుంచుకుంటే రంకుతనం"

"ప్రపంచంలో డబ్బుకివున్న విలువ మరిదేనికీ లేదు"

"డబ్బులేని మనిషిగా పుట్టడం కంటే కుళ్లు కాలవలో పురుగుగా పుట్టడం మంచిది"

ఇది ఆయన ప్రైవేట్ పిలాసఫీ.

అంచేత వారు చాలా ఆర్జించేరు. "న్యాయాన్ని బజార్లో అమ్మేడు" అని అతన్ని చాలామంది నిందిస్తారు.

మాలపల్లిలో మంగళాష్టకాలని కోర్టులో న్యాయం ఏవిటండీ? డబ్బు చూపెట్టకుండా పోలీసువాడు కాలు కదుపుతాడా? డాక్టరు శవాన్ని కోస్తాడా? గుమాస్తా కాయితం కదుపుతాడా? సాక్షి గాడు బోనెక్కుతాడా? బంట్రోతుగాడు ప్రమాణం చేయిస్తాడా? ఆఖరికి గాంధీగారైనా ఫీజు పుచ్చుకోకుండా వాదించేడా? కొబ్బరి కాయ లేకుండా గుళ్ళోకి వెళ్ళగలం కాని, డబ్బు లేకుండా కోర్టుకి వెళ్ళలేం. మరలాంటప్పుడు నన్ను ఒక్కణ్ణీ మడికట్టుకోమంటారా? కట్టుకుంటాను స్వామీ! కాని వడ్డించచే వాడెవడు? యివాళో రేపో రిటైరు కావలసిన ముండావాడిని నాకు దగ్గులు మప్పుతారా?

"ఇదుగో! నేను చెప్తున్నాను వినండి. నేను హైకోర్టు జడ్జీని కాను. జిల్లా జడ్జీని కాను" చచ్చేకాలానికి మునసబయ్యేను. కోర్టులు గురించి నాకు తెలిసినంత చీఫ్ జస్టిస్ క్కూడా తెలీదు.

కోర్టుకి అరమైలు దూరంలో ఆగిపోతుంది నిజం. అబద్ధమే కోర్టుని భల్లూకంలా పట్టుకుంటుంది"

"డబ్బు ఖర్చుపెట్టకపోతే పోలీసువాడు ఖూనీకేసైనా సరే రిజిష్టరు చెయ్యడు. డబ్బు చూపిస్తే, ఒక్కడు నిన్ను తంతే వాడు పెళ్లాం బిడ్డలతో సహా వచ్చి నిన్ను చావజంపి చెవులు మూసేదని సెషన్సు కేసు పెట్టేస్తాడు. డాక్టరు దొంగ సర్టిఫికెట్లు పరపర్రాసి పారేస్తాడు. సాక్షులు పెళపెళ చెప్పేస్తారు. వకీలు దణదణ వాదిం చేస్తాడు. ఆ అరపమీద అమాయకమ్ముండావాడు శిక్ష వేసేస్తాడు".

"అంచేత నేను చెప్పేదేవిటంటే బాబూ, న్యాయం చేస్తున్నా మని చెప్పే జడ్జీలు నాయనమ్మలు ....."

ఇది కూడా వారి ప్రైవేట్ ఫిలాసఫీయే.

అయితే వారికి విచారమన్నది లేదని చెప్పడానికి వీల్లేదు. అతనికి మొదట్లో చిరుబెంగ వుండేది – "ఈ డబ్బు ఎక్కడ దాచను" అని అయితే పెరుగుతున్న డబ్బుతో పాటు ఆ బెంగ కూడా యింతై, అంతై మహావృక్షమై ప్రస్తుతం ఆయనకి మనశ్శాంతి లేకుండా చేస్తోంది.

"ముష్టి మూడొందలు జీతగాణ్ణి, ఇన్ని వేలు బేంకులో వేస్తే బేంకువాళ్ళూరుకున్నా, వూళ్లోవాళ్ళు తెలిస్తే హైకోర్టు వాళ్ళు వూరుకోరు. నా డబ్బుకి అడ్డమాని వెధవలకి ఎక్సప్లనేషన్సు చెప్పుకోవాలి. పక్కవాడి సంగతి పట్టించు కున్నంతకాలం ఈ దేశానికీ, ప్రజలకీ మోక్షం లేదు, వుండదు" ఎవరెలా పోతే తనకేం గాని ప్రస్తుతం ఈ డబ్బు ఎక్కడ దాచటం? అందరికీ ఆర్జించటం సమస్య ఐతే. తనకి వున్నది దాచుకోవడం సమస్యే అయిపోతోంది. ఇంట్లో ఐరన్ సేపుంది. కాని అందులో పెట్టే ఏం మిగలేట్టు లేదు. తను రిటైరయ్యే నాటికి తనకో లక్ష – పిల్ల లకో లక్ష–అధమం ఆరు లక్షలన్నా సేవ్ చెయ్యాలనుకున్నాడు. కాని ఈ పిల్లలు అన్నం, నీళ్ళు మానేసి కరెన్సీ నోట్లే తినేస్తున్నారు. ఆ మాత్రం తెలియొద్దూ ఇదంతా ఎవరికోసం? తను చస్తే కర్ర లతో కాకుండా కరెన్సీ నోట్లతో కాలుస్తారా? వీళ్ళ కెందుకు అర్థం కాదూ? తరుచు ఆయన ఎంత ఆలోచించినా అర్థం కాని విషయాలివి.

ఆయనకి అర్థం కానిది యిదొక్కటే కాదు. స్టేంప్ యాక్టుకీ, కోర్టు ఫీజు యాక్ట్‌కి తేడా వుందన్న విషయం కాని, వుంటే అదేఁవిఁటో గాని ఆయనకి అర్థం కాలేదు. అయితే ఇది అర్థం అయినా, కాకపోయినా ఆయన కొచ్చిన కష్టనష్టాలేం లేవు, వుండవు.

"వాద ప్రతివాదాలు, అసందర్భపు ఆర్గుమెంట్లు ఓపిగ్గా విని విన్నదంతా చాదస్తంగా చదివి జడ్జిమెంటు చెప్పే వాళ్ళకి యాక్టులు. తనక్కాదు, అలాంటి వాళ్ళకి, ఐ రియల్లీ పిటీ దోజ్ పూర్ ఫెలోస్. నాక్కావలసింది డబ్బు. వాడిక్కావల సింది జడ్జిమెంటు. వెరీ సింపుల్" పైకి వ్యక్తం చెయ్యని ఆయన మనోగతాభిప్రాయం యిదే.

ఆ రోజు మేస్ట్రీటు గారికి ట్రాన్సఫరు ఆర్డరు వచ్చింది.

ఆ రోజు వారి మనస్సేం బాగులేదు.

మనస్సు బాగులేకపోవడం వచ్చిన ట్రాన్స్‌ఫరు గురించి కాదు. ఎటూ తేల్చలేని కేసు గురించి. ఇంతవరకు ఆయన తన సర్వీసులో ఏ కేసుగురించీ యింత సీరియస్‌గా ఆలోచించ లేదు. ఆ అవసరం కూడా రాలేదు. ఇప్పుడు క్వైట్ డిఫరెంట్ కేసు, వివరాలు ఆయన్ని ఎప్పుడూ బాధించవు. అంకె దగ్గరే తేలడం లేదు. కాశ్మీరు సమస్యంత కఠినంగా వుంది. రేపు జడ్జిమెంటు చెప్పబోయే కేసులో యిద్దరూ పోటీ పెట్టుకొని పాడు తున్నారు. డబ్బుతో పులిసి పోయున్నారు. పుండాకోరు వెధవలు. ఏం పొగరు! ఇంకా వాళ్ళ ధర్మమా అని తనోసారి కేసు వివరాలు తిరగెయ్యాలి.

తప్పదు మరి, పరువుకోసం ఒకడు, పగమీద మరోడు – తలతెగిన కోళ్ళలా గింజుకుంటున్నారు వెధవలు. డబ్బుంటే కధా పరువుండేది. డబ్బుంటే ఒక్క పరువేమిటి? వీళ్ళ పిండా కూడు, యింకా చాలా గడించవచ్చును. కానీ యిలాంటి వాళ్ళు ఊరికి ఇద్దరుంటే చాలు, తన ఆశయం తప్పక నెరవేరుతుంది.

ఆశయాలు నెరవేర్చుకోవడంలో శాస్త్రి పేరే చెప్పుకోవాలి. వారి తాతతండ్రుల్నే తల్చుకోవాలి. నాలుగు తరాల్నుండి తరగ కుండా వస్తున్న నాలుగువందల ఎకరాల్ని, నారాయణ మీది పగనీ అతిభద్రంగా కాపాడుతూ వస్తున్నారు శాస్త్రిగారు.

ఈ రెండు కుటుంబాల్లో మూడుతరాలై ఎవరూ సహజమైన చావు చావలేదు. వీరి తాతలూ–వారి తాతలూ ఎందుకు తన్ను కున్నారో ఈ తరం వారికి తెలీదు. కాని ఒకర్నొకరు ఖూనీలు చేసుకున్నారని మాత్రం బాగా గుర్తిండిపోయింది.

ఆ కాలంలో విపరీతమైన దొంగతనాలు జరిగేవిట. ఆ దొంగల్లో చేతులు కలిపి, వారిద్దరి తాతలూ వాటాలూ పంచుకునే వారట. ఒకసారి ఒక పెద్ద దొంగతనంలో దొంగలకీ, వీరికీ వాటాలు కుదరక, ఆ దొంగల్ని వీరిద్దరూ చంపేసి తమ పెరట్లోనే

రాత్రికి రాత్రే తగలబెట్టారనీ అయితే దరిమిలా వీరిద్దరి వాటాలు కుదరక తన్నుకున్నారనీ, ఆ తగువే ఈ నాటికీ నిల్చిపోయిందనీ ఒక పుకారు మాత్రమే.

శాస్త్రిగారి యిద్దరు కొడుకులు అమెరికాలో ఆటోమొబైల్ యింజనీరింగు చదువుతున్నారు. మిగిలిన ఇద్దరు ఆధునిక పద్ధతుల్లో తమ నాలుగువందల ఎకరాల్ని సాగుచేస్తున్నారు. శాస్త్రిగారు తమ ఆస్థి అజమాయిసీని కొడుకుల కిచ్చేసి, నారాయణ మీది అజమాయిషీని తనే వుంచుకున్నారు.

వారు బహు లౌక్యులు.

పటపట్టడంలో నాగుపాములాంటి వారు.

పగ తీర్చుకోవడంలో పరశురాముడి లాంటివారు.

ఆ వాడకట్టులో వారి మాటకి ఎదురూ, వారి చేతకి చెదురూ లేదన్న విషయం అందరికన్న ఎక్కువగా వారికే తెలుసు. వారిప్పటి వరకూ అనుకున్నవీ, అనుకోనివీ అన్నీ సాధించేరు. ఒక్క నారాయణని నామరూపాల్లేకుండా నాశనం చెయ్యడం తప్ప. "ఇది పూర్తి చేస్తే యింక ఈ అవతారం చాలించేస్తాను" అని అనుకుంటూ ఉంటారా యన తన అవతార ముఖ్యోద్దేశం నారాయణ సంహారమే అయినట్టు.

అయితే వారి అవతార విశేషాలేవీ నారాయణకి తెలీదు. తెలుసుకోవాలన్న కుతూహలం కూడా లేదనికి. తాతల్నాటి తగువులంటే అతని కిష్టం లేదు. చీమక్కూడా చెడుతలపెట్టని మనస్తత్వం అతనిది. లేనిదానికోసం ఏడ్చేకన్న వున్నదాన్లో తృప్తి పడటం మంచిదన్న హంశం బాగా జీర్ణించుకున్నా డతను. అంచేత తనకున్న వందెకరాలు ఉన్న ఒక్క కూతురికే రాసేసి, ఎమ్మే, పాసైన మేనల్లుడ్నే అల్లుడిగా చేసుకొని, యిద్దరినీ తన దగ్గరే వుంచుకున్నాడు. వూరికే కూర్చుని కక్షలు పెంచుకోవడం యిష్టం లేక అల్లుడికి పొలం పనుల్లో సాయపడుతూ వుంటాడు.

శాస్త్రిగారి చాకచర్యం వల్లనైతేనేమి, లౌక్యం వల్లనైతేనేమి. నారాయణ యింటికెళ్ళిన ముష్టివాడు కూడా శాస్త్రిగారింటికి రాడు. వారింట్లో పెళ్ళికి కూడా వారికి పిలుపుండదు. వీరింటి దినానికైనా వారి కుక్క కూడా రాదు, వీరిద్దరూ ఖర్మవశాత్తునైనా కలియకుండా, జాగ్రత్తపడ్డాయి ఊళ్ళో వీళ్ళిద్దర్ని నమ్ముకున్న కొన్ని కుటుంబాలు. ఇళ్ళు యిరుగు పొరుగు కాకపోయినా, పొలాలు పక్క పక్కనే వున్నాయి యిద్దరివీ.

❖ ❖ ❖

అన్నిపన్లు అల్లుడు చక్కపెడ్తున్నా, రోజూ సాయంత్రం అలా చల్లగాలికి పొలం గట్టుకి షికారు వెళ్లందే తోచదు నారాయణకి. అలా వెళ్ళినప్పుడు తన పొలం చూసి సంతోషిస్తాడే తప్ప పక్కనున్న శాస్త్రిగారి పొలం చూసి ఏనాడూ ఈర్ష్య పడడం జరగలేదు. అందుకే అతన్ని బాగా తెలిసినవాళ్ళు దైవభక్తి, పాపభీతీ కలవాడంటారు.

అలవాటు ప్రకారం ఆ రోజు కూడా పొలానికి వెళ్ళేడు నారాయణ. వెళ్ళిన తరువాత ఒకసారి పొలం అంతా కలియ తిరిగేడు. తిరుగుతున్నంతసేపూ ఒళ్లు తెలియలేదు. అతనికి, తెలిసిన తర్వాత చూసుకుంటే తన హద్దుదాటి శాస్త్రి పొలంలో వున్నట్టు అనిపించింది. తన జీవితంలో ఇటువంటి పొరపాటు జరగడం ఇదే ప్రథమం. ఎలా జరిగింది. చుట్టూ పరిశీలనగా చూసేడు. తన పొలంలోనే వున్నాడు. సందేహం లేదు. కాని గట్టు వుండవలసిన చోట లేదు. కొంత ముందుకి వెళ్ళి పోయినట్టు అనిపించింది. ముసలితనం వల్ల చాదస్తం పెరిగి సరిగ్గా తెలియడం లేదేమో అని ఒంగి మళ్ళా చూసేడు. గట్టు విషయం పొరపాటు పడవచ్చు. కాని గట్టు పక్కనే వుండే మూడు నిలువుల తాటిచెట్టు ఏదీ? ఏమైందో పరిశీలనగా చూస్తే శాస్త్రి పొలంలో వుంది, బావుంది!!

మైలురాళ్ళు, చెట్లు పరిగెడుతున్నట్లు చిన్నప్పుడెప్పుడో పుస్తకాల్లో చదివిన గుర్తు కాని ఎప్పుడూ అనుభవంలోకి రాలేదు తనకి. ఈ వేళ మాత్రం హద్దురాళ్ళూ, తాటిచెట్టు వేళ్ళతో సహా కదిలి పోయేయి. పోనీ తనే ఇదివరకు తాటిచెట్టు కొట్టిం చేసేడేమో అనుకోవడాని కేం అభ్యంతరం లేదు. కాని శాస్త్రి పొలంలో ఉన్నట్టుండి మూడు నిలువల తాటి చెట్టు ఎక్కడనుండి వచ్చినట్టు? ఈ చుట్టు ప్రక్కల ఎక్కడా తాటిపిలక కూడా లేదే, తన గట్టు దగ్గర తప్ప.

ఒక వేళ గారడివాడు టెంకలో నుండి మూరెడు మామిడి చెట్టు అప్పటికప్పుడు పుట్టించగలడేమోగాని, రాత్రికి రాత్రే శాస్త్రి మూడు నిలువుల తాటిచెట్టు ఎలా పుట్టించగలిగేడు? ఒకవేళ శాస్త్రి కేవైనా గారడీ వచ్చునా? ఈ గారడీ ఏవిటో ఆలోచించగా, ఆలోచించగా, కొంతసేపటికి జరిగినది లీలగా అర్థం అయీ కానట్టు అయింది. అతనికి వెంటనే మనసు మండిపోయింది. గుండె ఆగిపోయినట్లయింది. తొందరపడే స్వభావం కాదు కాబట్టి, ఇంటికి వెళ్ళి నిదానంగా రాత్రంతా ఆలోచించేడు. ఆలోచించి ఒక నిర్ణయాని కొచ్చాడు.

ఏ నిర్ణయమైనా సరే తీసుకున్న తర్వాత మరింక ఆలస్యం చెయ్యడతను. మర్నాడుదయం ఆలస్యం చెయ్యకుండా, అల్లరి పడకుండా తనకి తెలిసిన ఒక సర్వేయర్ని తీసుకొని వెళ్ళి పొల మంతా ఒకసారి కొలిపించేడు. కొలతలు పూర్తవ్వగానే ఒక్కసారి అతని గుండె కొట్టుకోవడం ఆగి, మళ్ళీ కొట్టుకుంది.

యాభై సెంట్ల పొలం తక్కువైంది.

తన మనస్సు, చూపు పొరపాటు అయితే అవవచ్చు కాని కొలతలు అబద్ధం చెప్పవు.

జరిగిన విషయం అర్థం చేసుకోలేనంత తెలివి తక్కువ వాడుకాదు అతను. వెంటనే తన కర్తవ్యం కూడా నిర్ణయించేసు కున్నాడు. ఇలాంటి విషయాల్లో అల్లరి పడటం, కోర్టుల చుట్టూ తిరగడం, యాభై సెంట్లు పొలానికి యాభై వేలు ఖర్చు పెట్టడం, యివన్నీ తను చెయ్యవలసినవీ, చెయ్యతగినవీ కావు. అయితే మరే మిటి చెయ్యటం? తాటి చెట్టుసహా పొలం ఎలా కాళ్ళొచ్చి వెళ్ళి పోయిందో, తిరిగి అలాగే తెచ్చేసుకోవడమే. అంతే. అదే మంచిది.

ఆ వేళ మధ్యాహ్నం ఓ కునుకు తీసిన తర్వాత నలుగురు కూలీలనువెంటపెట్టుకొని పొలానికి వెళ్ళేడు నారాయణ.

పాండవులెప్పుడెక్కడ ఏం చేసేదీ దుర్యోధనుడికి తెలుసు. మనదేశంలో ఎప్పుడు ఎక్కడ ఏం జరుగుతున్నది చైనా వాళ్ళకి తెలుస్తుంది. శాస్త్రిగారు దుర్యోధనుడి వంశజుడూ కాదు, చైనా దేశీయుడూ కాదు. అయినప్పటికీ వారికి నారాయణ మూమెంట్స్ ముందే తెలిసిపోతాయి. అలా తెలుస్తాయన్న విషయం కూడా నారాయణకి తెలియక పోలేదు.

నారాయణ కూలీలతో పొలం చేరేసరికి శాస్త్రి పొలంలో కూలీలు సరిహద్దు సైనికుల్లా నిల్చున్నారు. హద్దు కదిలితే పీకలు తెగుతాయన్నారు.

మాటకి మాట తెగులు.

కర్రకి కర్ర తెగులు.

మాటలు ముదిరి బూతలయ్యేయి.

కర్రలు ఎగిరి ఎముకలు విరగేయి.

బుర్రలు ఎగరకముందే నారాయణ కోలుకొని, తన కూలీ లని, తీసుకుని వెళ్ళిపోయేడు, కాని ఇది ఇక్కడితో ఆగదని, జరగబోయే కురుక్షేత్రానికి కిది నాందీ ప్రస్తావన మాత్రమేనని అతనికి తెలుసు. అది ఆగలేదు.

తన కూలీలు తన పొలంలోపని చేసుకుంటూ వుంటే, నారా యణ అక్రమంగా, అన్యాయంగా, అకారణంగా వాళ్ళని తన మనుషుల చేత కొట్టించేడనీ, తను కూడా కొట్టేడనీ – మేస్ట్రీటు కోర్టులో మర్నాడు కేసు దాఖలు చేసేడు శాస్త్రిగారు.

ఈసారి నారాయణని కాపాడ్డం శ్రీమన్నారాయణుడి తరం కూడా కాదు. అనుకున్నారు నర రూపంలో వున్న శాస్త్రిగారు. వీరి శపథం మేస్ట్రీటుగారికీ, నారాయణకీ కూడా తెలుసు.

ఈ కేసే ఆ రోజు మేస్ట్రీలు గారి మనస్సంతా పాడు చేసింది.

నా పొలం కలుపుకొని, నా కూలీలని కొట్టి, నా మీద క్రిమినల్ కేసు బనాయిస్తాడా? వీడికి పుట్టగతులు, వీడి పిల్లలకు అన్నం, నీళ్ళు వుంటాయా? వాళ్ళ సంగతి దేవుడెరుగు గాని, ప్రస్తుతం తన సంగతేమిటి? భూమి పోయే, జైలు వచ్చే, అని జైల్లో డోలు వాయించుకుంటూ కూర్చోవాలి. పోనీ కోర్టులో న్యాయం జరుగుతుందన్న ఆశ ఏ కోశానా లేదు. ఆ మేస్ట్రీటు జలగ తమ ఆస్థి మొత్తం పీల్చందే వదిలేట్టు లేదు. వెధవ, తమ పరువుతో ఆటలాడుతున్నాడు. పదివేలా? జైలా? అని సినిమాలో విలన్‌లా అరుస్తున్నాడు. ఏ పాపం ఎరగని పాపానికి పదివేలు పరిహారమా? తన మట్టుకు జైలే బావుండే ట్టుంది. కాని ఆ తర్వాత శాస్త్రిగారు తమని బతకనిస్తాడా? తన వంశానికి శాశ్వత జైలుముద్ర పడిపోదూ? ఇలా ఆలోచించి చివరకు ఎటూ తోచక, ఎందుకైనా మంచిదని అల్లుణ్ణి సలహా అడిగేడు నారాయణ ఏఁవిఁటి దారి? అని.

అల్లుడు మావ కడుపున పుట్టలేదు. అంచేత మావ పోలికలు రాలేదు. మావలా మెతకకాదు. మెరికలాటివాడు. శాస్త్రికే లౌక్యం పాఠాలు చెప్పగల సమర్థుడు. మావంటే అభిమానమే కాని అసూయ లేనివాడు. అంచేత మావకొచ్చిన ఈ సమస్యని అన్ని ఏంగిల్స్‌లోంచి ఆలోచించాడు. ఒక రాత్రి రెండు పగళ్ళు ఆలోచించి ముష్టి డబ్బే కదా! పారేయండి అడిగినదానికి మరో ఐదు ఎక్కువ పారేసినా ఫర్వాలేదు. ముందు ఈ గండం గడవాలి కదా! లేకపోతే ఆ శాస్త్రే కొనేస్తాడు అన్నాడూ మాఁవఁతో.

మాఁవఁకే ముచ్చెమటలు పోసి ఎండిపోయేయి. ఏం దారుణంరా అబ్బీ! ఏం బాపనయ్యా బావున్నావా అంటే నా పాతబాకీ ఎప్పుడు తీరుస్తావ్ అన్నట్టు–వెనకటి కెవడో ఉపాయం చెప్పరా నాయనా అంటే, అడిగినదానికి ఐదు ఎక్కువిమ్మం టావా? అత్తగారి సొమ్ము అల్లుడు ధారపోసే దన్నది ఒట్టి సామెతే

అనుకున్నాను. పైగా నాది ముష్టి సొమ్మా? మా తాతతు ముష్టెత్తి గడించేరను కున్నావా? నా తండ్రీ! ఇంతకీ నీ తప్పేం వుందిలే. క్రిమినల్ కేసంటే కుక్కకి కూడా లోకువే. అని మనసులో అను కున్నా, అల్లుడి సలహా పాటించక తప్పలేదు నారాయణకి.

❖ ❖ ❖

మర్నాడు నారాయణ మీది కేసు కొట్టేసేరు మేస్ట్రీటు గారు. ఆ సాయంత్రమే ఛార్జీ కూడా ఇచ్చేసారు, కొత్త మేస్ట్రీటు గారికి.

ఇంక నాలుగు రోజుల్లో మేస్ట్రీటు గారు ఆ వూర్నించి వెళ్ళి పోతారు. ఈ రోజు రాత్రి క్లబ్బులో వారికి కుటుంబ సమేతంగా డిన్నరు ఏర్పాటు చేసేడు క్లబ్బు సెక్రటరీ, నారాయణ అల్లుడు, క్లబ్బుకీ, మేస్ట్రీటు గారింటికి అర ఫర్లాంగే దూరం వున్నప్పటికీ, వారిని దగ్గరుండి కారులో తీసుకొని వెళ్ళేడు. డిన్నరు పెళ్ళంత ఘనంగా జరిగింది.

జడ్జీలకి చెవులేగాని కళ్ళు వుండవన్న నింద మన మేస్ట్రీటు గార్ని చూశాక తొలగించక తప్పదు. వీరు ముద్దాయి మొహం చూడగానే అతను దోషో కాదో ఠక్కున చెప్ప గలిగేవారు. ఇలాంటి న్యాయమూర్తిని మనం ఇంకా కొంతకాలం పాటు వుంచుకోలేకపోవడం మన దురదృష్టం, వీరి గుణగణాల గురించీ, నీతినిజాయితీల గురించీ నాలాంటి వాడు మాట్లాడడం సాహసమే అవుతుంది. అంచేత తిరిగి వీరు ప్రమోషను మీద మన వూరు రావాలని కోరుకోవడం మన విధ్యుక్తధర్మం. కనీసపు కోరిక. అంటూ తన ఆఫ్టర్ డిన్నర్ స్పీచ్ ముగించేడు సెక్రటరీ.

డిన్నరైన తర్వాత, సెకండుషో సినిమాకి తీసుకొని వెళ్ళి, మళ్ళీ వారిని కారులో ఇంటికి దిగబెట్టినప్పుడు, ఇంటి దగ్గర వారు ఫెయింటు అవకుండా పట్టుకుని కూర్చో పెట్టేడు. ఆయన ఫెయింటు అవడానికి కారణం ఆయన అనారోగ్యం గాని, లేక అంతకుముందే డిన్నర్లో సేవించిన మందు గాని కారణంకాదు.

వీరంతా యిల్లు చేరేసరికి యింటివీ, యినప బీరువావీ తలుపులు తీసి వున్నాయి. జవాను స్తంభానికి కట్టేసి వున్నాడు. ఇనప్పెట్టె ఖాళీగా వుంది.

తర్వాత కార్యక్రమం అంతా నారాయణ అల్లుడే చకచకా జరిపేశాడు. ఎస్.ఐ.ని. పిల్చుకొని రావడం, మేస్ట్రీటు గార్ని వూరడించడం, తెల్లవార్లూ ఎస్.ఐ.తో కలిసి దొంగల కోసం తిరగడం అన్నీ స్వయంగా చేసేడు. మర్నాడు ఉదయం పది గంటలకి యింటికి వెడుతూ మీరేం విచారించకండి సార్. దొంగ వెధవలు ఎక్కడికి పోతారు? మీలాంటి వారి ఉసురు వూరికే పోదు. నేనూ, ఎస్.ఐ. కలిసి వూళ్ళన్నీ గాలించి మీ సొమ్ము మీకప్పచెప్తాం. నిన్నటినుండి యింటి దగ్గర కనిపించ లేదు నేను. మా వాళ్ళేం భయపడుతున్నారో? ఒక్కసారి యింటికి వెళ్ళి తిరిగి తమ దర్శనం చేసుకుంటాను. అంటూ ఓదార్చి వెళ్ళిపోయేడు.

ఆ రాత్రి నారాయణ అల్లుడు నారాయణకి లంచం సొమ్ము పదివేలు యిచ్చేస్తూ, ఇదిగో మరో పదిహేను వేలు ఎక్కువ వున్నాయి. ఆ మేస్ట్రీటు గాడికే యిచ్చేస్తారో, కుక్కల ఆస్పత్రికే యిచ్చేస్తారో మీ యిష్టం అంటూ డబ్బు ఇచ్చేసాడు.

**(1971)**

# మున్నా లేక సమ్ వేర్ ఇన్ "బాంగ్లాదేశ్"

**మూ**డేళ్ళ మున్నాకి దేశంలో ఏమవుతోందో తెలియదు కాని ఏదో అవుతుందని మాత్రం తెలుసు. అసలు మున్నాకి యీ నెల రోజులనుండి ఊపిరి సలపడంలేదు. పల్లె అంతా ఏదో సంబరం చేసుకున్నట్లు ఎంతో హడావిడిగా సరదగావుంది. ఒక రోజు ఉన్నట్టుండి పాతజెండాలు తీసేసి ఇళ్ళమీద కొత్త జెండాలు పెట్టేరు. కొత్త జెండాలు పచ్చగా ముచ్చటగా ఎంతో నచ్చేయి మున్నాకి. తన యింటిమీదున్న జెండా తన స్వంతం అన్నట్టు ఫీలయ్యేడు. ఎంచేతంటే ఆ వేళ ఇంటింటికి జెండాలు పంచిపెడుతున్న కుర్రాళ్ళు – వాళ్ళ ఇంటికి కూడా వచ్చినప్పుడు మున్నా నాన్నకి సలాం పెట్టేరుగాని జెండా ఇవ్వలేదు. మున్నాకి జెండా యిచ్చి, ఇంటి ముందు ఖాళీస్తలంలో కొయ్యపాతి మున్నా చేత జెండా ఎగరవేయించారు. జెండా ఎగుర వేశేక అందరూ మున్నాని ముద్దుపెట్టుకున్నారు. మామూలువాళ్ళు ముద్దు పెట్టుకున్నప్పుడు మున్నాకి కితకితలు అనిపించి మొగ్గలా ముడు చుకుపోయేడు.

ఆ తర్వాత రోజూ పల్లెకు కాస్తదూరంగా వున్నవాళ్ళ ఇంటి ముందే ఆడామొగా అంతా పోగై డ్రిల్లు చేసేవారు.ఆ డ్రిల్లు ఎంతో నచ్చింది. వాళ్ళలో కొంతమందికి కాకీబట్టలు వుండేవి, ముగ్గురికే తుపాకులుండేవి. మిగిలినవాళ్ళకి పంచెలు, పైజ